క్లుప్తంగా

సౌమ్యకు ఎమ్మెల్యే దొరబాబు పరామర్శ



కాకినాడలో చికిత్స పొందుతున్న సౌమ్యను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

కొత్తపల్లి: పొన్నాడ శివారు శీలంవారి పాలేనికి చెందిన శీకోలు సౌమ్య బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతూ కాకినాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆమెను గురువారం ఎమ్మెల్యే దొరబాబు పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మండల కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు రూ.10 వేలు, మండల వ్యవసాయ అడ్వయిజరీ కమిటీ చైర్మన్ జ్యోతుల బాబులు రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. ఆమె వైద్యానికి ప్రభుత్వం ద్వారా అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. సౌమ్యను పరామర్శించిన వారిలో ఎస్సీ, ఎస్టీ డివిజన్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బండి దావీదు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్, వైస్ ఎంపీపీ చెట్టుబత్తిన సురేష్‌కుమార్ ఉన్నారు.

వాసవీ క్లబ్ మగువ సభ్యుల ఎన్నిక



నూతనంగా ఎన్నికైన గొల్లప్రోలు వాసవి క్లబ్ మగువ సభ్యులతో నాయకులు

పిఠాపురం: గొల్లప్రోలు నగర పంచాయతీలోని షిర్డీసాయి గొల్లపూడివారి కల్యాణ మండపంలో గురువారం వాసవీ క్లబ్ ఇంటర్ నేషనల్ సమావేశం జరిగింది. వాసవీ క్లబ్ ఇంటర్ నేషనల్ అధ్యక్షురాలు పాలకుర్తి గాయత్రి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో గొల్లప్రోలు వాసవీ క్లబ్ మగువ సభ్యులను నూతనంగా ఎన్నుకున్నారు. వాసవి క్లబ్ మగువ గొల్లప్రోలు అధ్యక్షురాలిగా కేదారశెట్టి లావణ్య, కార్యదర్శిగా దొంతుల లక్ష్మి, ట్రెజరర్‌గా దుర్గపు పార్వతిలతో పాటు 30 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ నాయకులు కాకి మణికంఠ, కుసుమంచి పాపారావు, గ్రంధి లచ్చన్న, దంగేటి రామకృష్ణ, కేదారశెట్టి వీవీ చలపతి రావు, ఊర సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సైన్సు పరీక్షకు 23 మంది గైర్హాజరు

సామర్లకోట: పదో తరగతి పరీక్షల్లో భాగంగా గురువారం జనరల్ సైన్సు పరీక్షకు 23 మంది గైర్హాజరైనట్టు ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ మండల పరిధిలోని 9 పరీక్ష కేంద్రాల్లో 1764 మంది పరీక్షకు హాజరు కావలసి ఉండగా 1741 మంది హాజరైనట్టు తెలిపారు. మొదటిసారి పీఎస్, ఎన్ ఎస్ కలిపి పరీక్ష జరిగిందన్నారు. గురువారం నవర జెడ్పీ హైస్కూల్‌లోని పరీక్ష కేంద్రాన్ని స్క్వాడ్ ఇన్‌చార్జి పిఠాపురం డిప్యూటీ డీఈఓ సుభద్ర ఆధ్వర్యంలో తనిఖీలు జరిగినట్టు తెలిపారు.

వీధి కుక్కలకు ఏఆర్‌వీ పంపిణీ



ఏఆర్వీ ప్రక్రియను ప్రారంభిస్తున్న చైర్మన్, వైస్ చైర్మన్

పెద్దాపురం: ప్రజా ఆరోగ్య పరిరక్షణలో భాగంగా పట్టణంలో వీధి కుక్కలకు యాంటీ ర్యాబిస్ వ్యాక్సినేషన్స్ చేయించినట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం మున్సిపల్ శానిటరీ విభాగం, పశు సంవర్ధక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఈ వ్యాక్సినేషన్‌ను ప్రారంభించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ కనకాల మహాలక్ష్మి, ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు, అగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ, మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు, పశుసంవర్ధక శాఖ ఏడి తుమ్మల రామస్వామి, కౌన్సిలర్లు విజ్జపు రాజశేఖర్, విడదాసరి రాజా, ఆరెళ్లి వీర్రాఘవులు, కో-ఆప్షన్ సభ్యుడు వాసంశెట్టి గంగ తదితరులు పాల్గొన్నారు.

గడ్డి ట్రాక్టర్ దగ్ధం

రౌతులపూడి: మండలంలోని కొట్టం-రౌతులపూడి రహదారిలో గురువారం ట్రాక్టర్‌పై తరలిస్తున్న గడ్డికి విద్యుత్ తీగలు తగిలి దగ్ధమైంది. గడ్డి ట్రాక్టర్‌కు ములగపూడి వద్ద 11 కేవీ విద్యుత్ వైర్లు తగిలి మంటలు వ్యాపించాయి. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి ట్రాక్టర్‌ను గ్రామ శివారులో కాళీ ప్రదేశానికి తీసుకువెళ్లి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమదంలో గడ్డి మెత్తం కాలిపోయింది. ట్రాక్టరు నాలుగు చక్రాలు దగ్ధమయ్యాయి. ట్రాక్టర్ కోటనందూరు మండలం కేఓ మల్లవరానికి చెందిన వేముల వరహాలుబాబుకు చెందినదిగా గుర్తించారు.

మామిడి పండుకు ఈగల బెడద

- మామిడి పంటను ఆశిస్తున్న పండుఈగ తెగులు
- ఆందోళన చెందుతున్న రైతులు
- జాగ్రత్తలు పాటించాలని అధికారుల సూచన

పిఠాపురం: మేడి పండు చూడు మేలిమై ఉండు పొట్ట విప్పి చూడు పురుగులుండు అన్నారు మహాకవి వేమన. ఇప్పుడు మామిడి పండును చూడు మేలిమై ఉండు పొట్ట విప్పిచూడు పురుగులుండు అంటున్నారు అధికారులు. ఎండాకాలం ఎప్పుడు వస్తుందా, ఎప్పుడెప్పుడు మధురమైన మామిడి కాయల రుచి ఆశ్వాదిద్దామా అని చిన్నలు, పెద్దలు ఎదురు చూస్తుంటారు. రకం ఏదైనా మామిడి రుచి ప్రత్యేకమైనది. అటువంటి మామిడి కాయలకు గత కొన్నేళ్లుగా పండుఈగ రూపంలో పెద్ద కష్టం వచ్చిపడింది. కాయ చూడడానికి పైకి బాగానే కనిపిస్తుంది. తీరా మాగ వేసి పండిస్తే కుళ్లు కనిపిస్తుంది. దాని లోపల చూస్తే బియ్యపు గింజ పరిమాణంలో తెల్లటి పురుగులు కనిపిస్తుంటాయి. ఒకప్పుడు కాపు దశలో వర్షాలు పడిన సందర్భాల్లో మాత్రమే ఇవి కనిపించేవి. అయితే గత కొన్నేళ్లుగా పండు ఈగ నష్టం రివాజుగా మారింది. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లోనూ ఈ పండుఈగ తెగులు కనిపిస్తున్నప్పటికీ మామిడికి ప్రసిద్ధి గాంచిన కాకినాడ జిల్లాలో ఎక్కువగా ఉందని ఉద్యానవన శాఖ అధికారులు తెలిపారు.



శంఖవరం మండలం మండపంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యాన శాఖ అధికారులు



పండుఈగ



మామిడి తోటలో పండుఈగ నివారణకు ఏర్పాటు చేసే లింగాకర్షక బుట్ట



పండుఈగ సోకి పురుగులు పట్టిన మామిడి కాయ

802 హెక్టార్లలో సాగు

పిఠాపురం నియోజకవర్గంలో 802 హెక్టార్లలో రైతులు మామిడి సాగు చేస్తున్నారు. మామిడిని పండుఈగ తెగులు ఆశిస్తే నష్టం అపారంగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. దీనికి తోడు గతంలో కరోనా నేపథ్యంలో సరైన మార్కెట్ లేక చాలా మంది రైతులు మామిడిని తోటల్లోనే ఎక్కువగా వదిలేశారు. దీంతో పండుఈగ తన సంతతిని పెంచుకుని తోటల్లో మాటు వేసి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. పండుఈగ తెగులు సోకితే మామిడి నాణ్యత పూర్తిగా దెబ్బతిని రాబడి పడిపోయి రైతు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. ప్రస్తుతం మామిడి సీజన్ కావడంతో పండుఈగ తెగులు పట్ల రైతులు అప్రమత్తగా ఉండాలని ఉద్యానవన అధికారులు సూచిస్తున్నారు.

రాలిన పండ్లతోనే..

మామిడి తోటల్లో ఎక్కడైతే నేల మీద రాలిన పండ్లను వదిలేస్తారో అక్కడ పండుఈగ విపరీతంగా పెరుగుతుంది. అలా నేల మీద వదిలేసే ప్రాంతాలను పండుఈగలు తమ సంతతిని వృద్ధి చేసుకోడానికి వేదికగా వాడుకుంటాయి. తద్వారా విపరీతంగా పండు ఈగలు పెరిగి చెట్లకు ఉన్న కాయల పైనా గుడ్లు పొదుగుతాయి. దీంతో కాయ బయటకు బాగా కనిపించినా లోపల పండు తయారయ్యాక పురుగులు కనినిపిస్తుంటాయి. పండు ఈగ జామ తోటల్లో ఎక్కువగా ఉంటుంది. అందుకని పక్కన జామ తోటలు ఉన్న ప్రాంతాల్లో మామిడి తోటలు ఉన్న రైతులు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలి. జామతోటల సీజన్ ముగియగానే పండుఈగలు మామిడి తోటలపై దాడి చేస్తుంటాయి.

ప్రత్యేక చర్యలతో నివారణ

ఎప్పటికప్పుడు మామిడి తోటల్లో రాలిన కాయలు, పండ్లను వెంటనే తీసి వాటిని దూరంగా ఒక గొయ్యి తీసి పాతి పెట్టుకోవాలి. లింగాకర్షక బుట్టలు (ఫెరిమోన్ ట్రాప్స్) తోటల్లో ఏర్పాటు చేసుకోవాలి. సుమారు ఒక ఎకరానికి 5 నుంచి 6 బుట్టలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా పండుఈగ ఉధృతిని నివారించవచ్చు. ఒక లింగాకర్షక బుట్టలో 4 ఈగలు పడితే కచ్చితంగా ఈగ ఉధృతి ఉన్నట్లు గుర్తించాలి. దీని నివారణకు పులిసిన కల్లుకు మలాతియాన్ రెండు మిల్లీ లీటర్లు కలిపి పులియబెట్టాలి. దానిలో ఏదైనా పండ్ల రసం కలిపి ఆ మిశ్రమాన్ని మట్టి పాత్రల్లో తోటల్లో అక్కడక్కడా పెట్టాలి. దానికి పండు ఈగలు అధికంగా ఆకర్షిమై ఆ రసం పీల్చి చనిపోయాయి. ఈ విధానం వల్ల రసాయనాలు ఉపయోగించకుండా సేంద్రియ పద్ధతిలో ఈగను నివారించుకోవచ్చు. ఈగ ఉధృతి మరింత ఎక్కువగా ఉంటే ఒక లీటరు నీటికి రెండు మిల్లీ లీటర్లు మలాతియాన్ కలిపి తోటల్లో పిచికారీ చేసుకోవాలి. కాయలకు కవర్లు ఏర్పాటు చేయడం ద్వారాను ఈగ ఉధృతిని తగ్గించుకోవచ్చు.

– పి.అరుణ్‌కుమార్, ఇన్‌చార్జ్ ఉద్యానవన అధికారి, గొల్లప్రోలు

అభివృద్ధిని చూసి ఓర్వలేకే దుష్ప్రచారం

- రాజ్యసభ సభ్యుడు సుభాష్ చంద్రబోస్
- గోర్సలో గడపగడపకూ మన ప్రభుత్వం

కొత్తపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓర్వలేక ఎల్లో మీడియా, ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్‌చంద్రబోస్ అన్నారు. మండలంలోని గోర్సలో గురువారం ఎమ్మెల్యే పెండెం దొరబాబు నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం, జగనన్నే మాభవిష్యత్తు కార్యక్రమాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో కలిసి గ్రామంలో ప్రతిఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ప్రభుత్వ పనితీరుపై ప్రజల అభిప్రాయాన్ని తెలుసుకున్నారు. ప్రభుత్వానికి మద్దతు తెలిపిన వారి ఇళ్ల గోడలకు స్టిక్కర్లను అతికించారు. ఈ సందర్భంగా బోస్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సుమారు 54 ప్రాజెక్టులు నిర్మించి వ్యవసాయాన్ని పండగలా మార్చిన దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అపర భగీరథుడుగా పేరు తెచ్చుకున్నారన్నారు. తెలంగాణ మంత్రి హరీష్‌రావు చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రెండు సార్లు భంగపడిందన్నారు. మద్రాసు, తెలంగాణ నుంచి విడిపోవడంతో పూర్తిగా రెవెన్యూ లోటు ఏర్పడిందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ఏపీలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల పట్టాలను మంజూరు చేశామన్నారు. ఎమ్మెల్యే పెండెం దొరబాబు మాట్లాడుతూ పిఠాపురం నియోజకవర్గంలో తన హయాంలోనే అభివృద్ధి జరిగిందని మాజీ ఎమ్మెల్యే వర్మ మతిస్థిమితంలేని మాటలు మాట్లాడుతున్నారన్నారు. ప్రజలు ఓట్లతో బుద్ధి చెప్పినా వర్మ తీరు మారలేదని ఎద్దేవా చేశారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బందరులో నిర్వహించిన సమావేశం జనం లేక వెలవెలబోయిందన్నారు. టీడీపీ, జనసేన పార్టీలు కనుమరుగయ్యే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో 175 స్థానాల్లోనూ గెలుపే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ శ్రేణులు పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రొంగల వీరబాబు, ఎంపీటీసీ కొండపల్లి సూర్య నాగేశ్వరరావు, జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్, మండల కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీలు మాదిరెడ్డి దొరబాబు, చెట్టుబత్తిన సురేష్‌కుమార్, పార్టీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, మండల వ్యవసాయ అడ్వైజరీ కమిటీ చైర్మన్ జ్యోతుల బాబులు, జిల్లా వైఎస్సార్ సీపీ యువజన అధ్యక్షుడు కొప్పన శివనాథ్, ఎస్సీ, ఎస్టీ డివిజన్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బండి దావీదు తదితరులు పాల్గొన్నారు.



గోర్సలో మహిళకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్ పర్సన్, వైస్ చైర్మన్ తదితరులు

పెద్దాపురం: స్థానిక మరిడమ్మ గుడి వద్ద స్నేహ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఆ వార్డు కౌన్సిలరు విడదాసరి రాజా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆటో యూనియన్ సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయం అన్నారు. అనంతరం పాదచారులకు, ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు. యూనియన్ సభ్యులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

మట్టి నమూనాల సేకరణతో రైతులకు మేలు



దుర్గాడలో మట్టి నమూనాల సేకరణపై సిబ్బందికి శిక్షణ ఇస్తున్న పిఠాపురం ఏడీఏ స్వాతి

పిఠాపురం: మట్టి నమూనాల సేకరణ ద్వారా భూసారం తెలియడంతో పాటు రైతులకు ఎంతో మేలు జరుగుతుందని పిఠాపురం ఏడీఏ పి.స్వాతి అన్నారు. గొల్లప్రోలు మండలం దుర్గాడ పంట పొలాల్లో మట్టి నమూనాల సేకరణపై గురువారం వ్యవసాయ శాఖ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. గ్రామ వ్యవసాయ సహాయకులు, ఉద్యాన సహాయకులు, పట్టు పరిశ్రమ సహాయకులకు ఆమె మట్టి నమూనాల సేకరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. సిబ్బంది వ్యవసాయ భూముల్లో మట్టి నమూనాలు సేకరించేటప్పుడు రైతుల సమక్షంలో తీసుకోవాలని సూచించారు. మట్టిని పరీక్షించిన తరువాత భూసారం, భూస్వభావం, సమస్యాత్మక భూముల వివరాలను రైతులకు వివరించాలన్నారు. ప్రతి పంట భూమికి ఏటా క్రమం తప్పకుండా భూసార పరీక్షలు చేయించాలని సూచించారు. గొల్లప్రోలు వ్యవసాయశాఖాధికారి సత్యనారాయణ, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

డీఎస్సీ-98 అభ్యర్థులకు పోస్టింగ్

సామర్లకోట: డీఎస్సీ-98పై కోర్టులో వివాదంతో అభ్యర్థులకు ఉద్యోగాలు రాని పరిస్థితి ఏర్పడింది. దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుని అర్హులకు పోస్టులు మంజూరు చేసిందని ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య తెలిపారు. ఈ మేరకు మండలానికి 9 పోస్టులు మంజూరు కాగ ఇప్పటి వరకు ఆరుగురు రిపోర్టు చేశారన్నారు. డీఎస్సీ రాసిన సమయంలో వయసు ఆధారంగా పోస్టులను ఇచ్చారన్నారు. ఈ మేరకు ఆరు నుంచి రెండేళ్లలో పదవి విరమణ చేసే వారికి పోస్టులు వచ్చాయని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 285 మందికి పోస్టులు మంజూరైనట్లు చెప్పారు. రిపోర్టు చేసిన వారిలో నలుగురు చేరారని మిగిలిన ఇద్దరు మంచి రోజు కోసం వేచి ఉన్నారన్నారు. వేట్లపాలెం కాంప్లెక్స్ పరిధిలో ఒకరు, నవర కాంప్లెక్స్ పరిధిలో గొంచాల పాఠశాలకు ఒకరు, మాధవపట్నం కాంప్లెక్స్ నుంచి జమునానగర్ ఎలిమెంటరీ పాఠశాలకు ఒకరు, మేడపాడు కాంప్లెక్స్ నుంచి మేడపాడు నెంబరు-2 ఎలిమెంటరీ పాఠశాలలో ఒకరికి నియామక పత్రాలు అందజేసినట్టు వివరించారు.



98 డీఎస్సీలో ఎంపికై రిపోర్టు చేసిన వారితో ఎంఈఓ

కేజీబీవీలో తనిఖీలు

తుని రూరల్: వి.కొత్తూరులోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో జిల్లా బాలికా సంరక్షణ అధికారి పి.ఉమామహేశ్వరి గురువారం తనిఖీలు చేశారు. పాఠశాలలో భోజనశాల, స్టాక్ రూమ్‌లో నిత్యావసర సరకులు, రికార్డులు, హాజరు పట్టీలను తనిఖీ చేశారు. విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థినులను కలిసి పరీక్షలు రాస్తున్న తీరు, ప్రత్యేక తరగతుల నిర్వహణపై ఆరా తీశారు. వచ్చే విద్యా సంవత్సరంలో బోధన మెరుగుపర్చుకునేందుకు కార్యాచరణ రూపొందించుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రిన్సిపాల్ అమృత వాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వి.కొత్తూరు కేజీబీవీలో రికార్డులు తనిఖీ చేస్తున్న జిల్లా బాలికా సంరక్షణ అధికారి ఉమామహేశ్వరి

నష్ట పరిహారం ఇప్పించాలని వినతి

ప్రత్తిపాడు: వైరస్ సోకి పంట నష్టపోయిన తమకు నష్ట పరిహారం మంజూరు చేయాలని మండలంలోని టి.రాయవరం రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ప్రత్తిపాడు తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు. టి.రాయవరంలో సాగు చేసిన వరి పంటలో సుమారు 80 ఎకరాల మేర పంటకు వైరస్ సోకిందని, దీని వల్ల పక్వానికొచ్చిన వరి వెన్ను విరిగి పంట నష్టం వాటిల్లిందని రైతులు తెలిపారు. పంట నష్టపోయిన తమకు ప్రభుత్వం ద్వారా బీమా సదుపాయం కల్పించాలని కోరారు. దీనిపై తహసీల్దార్ గోపాలకృష్ణ ఫోన్‌లో జగ్గంపేట ఇన్‌చార్జి ఏడీఏ యింటి వీర గంగాధర్‌తో చర్చించారు. సమస్యను ఉన్నతాధికారులకు నివేదిస్తామని రైతులకు ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతులు సేంద్రపు సుబ్బారావు, బత్తుల శ్రీను పాల్గొన్నారు.



ప్రత్తిపాడులో తహసీల్దార్ గోపాలకృష్ణకు సమస్యను వివరిస్తున్న రైతులు

ఉత్సాహంగా జగనన్నే మా భవిష్యత్తు



సామర్లకోటలో మహిళకు స్టికర్లు అందజేస్తున్న కౌన్సిలర్ కుసుమ



ఉప్పాడలో జగనన్నే మా భవిష్యత్ నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సామర్లకోట: ముఖ్యమంత్రి జగన్‌పై ప్రజల్లో విశ్వాసం మరింత పెరిగిందని కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పార్టీ నాయకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు ఇంటింటికీ పర్యటించి జగన్ మోహన్‌రెడ్డి పాలనపై గురువారం అభిప్రాయాలను సేకరించారు. అలాగే మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులోను పార్టీ కౌన్సిలర్లు, ఇన్‌చార్జిల ఆధ్వర్యంలో 'జగనన్నే మా భవిషత్తు' నిర్వహిస్తున్నారు. సెల్ నుంచి మిస్డ్ కాల్ ఇచ్చిన వెంటనే సీఎం కార్యాలయం నుంచి తమకు ఫోన్ వచ్చిందని పలువురు లబ్ధిదారులు తెలిపారు.

ఉప్పాడలో..

కొత్తపల్లి: మండలంలోని ఉప్పాడలో గురువారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ సచివాలయాల మండల కన్వీనర్ ఉమ్మిడి జాన్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మేరుగు ఎల్లజీ, పార్టీ నాయకులు గోగు బుజ్జి, బొందు రాము, భగవన్ తదితరులు పాల్గొన్నారు.

శాప్ నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షుడిగా లోవదుర్గ

ప్రత్తిపాడు రూరల్: శెట్టి బలిజ యాక్షన్ ఫోర్స్ (శాప్) ప్రత్తిపాడు నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షుడిగా ఏలేశ్వరం మండలం జె.అన్నవరం గ్రామానికి చెందిన న్యాయవాది కాకరపల్లి లోవదుర్గ నియమితులయ్యారు. ఈ మేరకు శాప్ అధ్యక్షుడు వాసంశెట్టి సుభాష్ ఆదేశాలు జారీ చేసినట్టు స్థానిక శెట్టిబలిజ సంఘం నేతలు రాళ్ల సీతారాం, వాసంశెట్టి సూర్యఅర్జున్ గురువారం తెలిపారు. శాప్ నియోజకవర్గ అధ్యక్షుడిగా ఎన్నికై న లోవదుర్గకు పలువురు ప్రజాప్రతినిధులు, సంఘ నేతలు అభినందనలు తెలిపారు.

రక్తదానంపై అపోహలు వద్దు

కాకినాడ: రక్తదానంపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించాల్సిన అవసరం ఉందని అడిషనల్ కస్టమ్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి పేర్కొన్నారు. గురువారం కాకినాడ కస్టమ్స్ హౌస్‌లో రెడ్‌క్రాస్ సహకారంతో జరిగిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. రక్తదానం వల్ల ఆరోగ్యం పాడవదనే విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. డిప్యూటీ కస్టమ్స్ కమిషనర్ రఘురామ్ మాట్లాడుతూ ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా జలియన్‌వాలా భాగ్ అమర వీరుల సంస్మరణార్థం ఈ రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. విశాఖ చీఫ్ కస్టమ్స్ కమిషనర్ సంజయ్‌తంత్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కస్టమ్స్ అధికారి రఘురామ్ 28వ సారి రక్తదానం చేసి పలువురి మన్ననలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సీహెచ్ వీరవెంకటరెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ కె.శివకుమార్, రెడ్‌క్రాస్ కార్యదర్శి శివకుమార్, కస్టమ్స్ సూపరింటెండెంట్లు సతీష్‌సింగ్, ఈశ్వరరావు, చౌదరి, కన్నారావు, వెంకటేష్, పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

తప్పులు లేని ఓటర్ల జాబితా రూపొందించండి

- కలెక్టర్ కృతికా శుక్లా
- రాష్ట్ర ఎన్నికల అధికారితో వీడియో కాన్ఫరెన్స్

కాకినాడ సిటీ: ఆంధ్రప్రదేశ్ ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) ముఖేష్‌కుమార్ మీనా అమరావతి నుంచి గురువారం సాయంత్రం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి కాకినాడ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కృతికా శుక్లా, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులతో కలిసి హాజరయ్యారు. ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా రూపకల్పన పురోగతిని కలెక్టర కృతికా శుక్లా సీఈవోకు వివరించారు. ఓట్ల సవరణ జాబితా అభ్యంతరాలు పరిష్కారం, ఎలక్టోరల్ రోల్స్, బీఎల్ రిజిస్టర్, ఎన్నికల పిటిషన్లు పురోగతి, ఎపిక్ కార్డుల ముద్రణ, పంపిణీ, రాబోయే సాధారణ ఎన్నికల సన్నద్ధతపై సమీక్షించారు. అనంతరం కలెక్టర్ కృతికా శుక్లా జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతూ ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా రూపకల్పన నిరంతర ప్రక్రియని దీనిపై ఈఆర్‌వోలు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఈఆర్‌ఓలు క్షేత్రస్థాయి బీఎల్‌ఓలను సమన్వయం చేసుకుని తప్పులు లేని ఓటర్ల జాబితా రూపకల్పనకు కృషి చేయాలన్నారు. కాకినాడ నగరపాల సంస్థ కమిషనర్ ఆర్ మహేష్‌కుమార్, జెడ్పీ సీఈవో ఎన్‌వీవీ సత్యనారాయణ, డీఆర్వో కె.శ్రీధర్‌రెడ్డి, కేఎస్ఈజెడ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.మనోరమ, కౌడా వీసీ సుబ్బారావు, కాకినాడ ఆర్డీవో బీవీ రమణ, కలెక్టరేట్ ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ఎం.జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

క్రికెట్ టోర్నీ విజేత వేళంగి వారియర్స్



విజేతగా నిలిచిన వేళంగి వారియర్స్ జట్టు

కరప: మండలం వేళంగిలో అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని రమ్య చారిటబుల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ పితాని అన్నవరం సహకారంతో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నీ విజేతగా వేళంగి వారియర్స్ నిలిచింది. వేళంగి హైస్కూలు గ్రౌండ్‌లో గురువారం వేళంగి టైగర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో వేళంగి వారియర్స్ విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన వారియర్స్ జట్టు 8 ఓవర్లలో 59 పరుగులు చేసింది. అనంతరం చేజింగ్‌కు దిగిన టైగర్స్ జట్టు 8 ఓవర్లలో 36 పరుగులు చేసి, ఓటమి పాలైంది. మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌గా దూల ప్రవీణ్ నిలిచారు. 16న డాక్టర్ అంబేడ్కర్ జయంత్యుత్సవంలో విజేతలకు బహుమతి ప్రదానం చేస్తామని నిర్వాహక వేళంగి గ్రాడ్యుయేట్ యూత్ ప్రతినిధులు ముడిగి కృష్ణ, ఎ.దుర్గాప్రసాద్, ఎర్రా విక్రమ్, చిట్టూరి అప్పన్న తెలిపారు.